ప్రజాశక్తి
బుధవారం 24 జనవరి 2024 5 అనంతపురం



ఎదిరించి హక్కులు సాధించుకున్న
అంగన్‌వాడీలకు అభినందనలు
సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్



న్యాయమైన హక్కుల సాధన కోసం అంగన్‌వాడీ కార్మికులు 42 రోజులుగా మొక్కవోని పట్టుదలతో రాష్ట్ర ప్రభుత్వ నిర్బంధాన్ని, కుయుక్తులను సైతం ఎదుర్కొని సమ్మెను జయప్రదం చేసి తమ కోర్కెలు సాధించుకున్నందుకు సిపిఎం జిల్లా కమిటీ అభినందనలు తెలియజేసింది. ఈ మేరకు సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ మంగళవారం మాట్లాడుతూ సమ్మెకు సంఘీభావం ప్రకటించిన రాజకీయ పార్టీలు, ప్రజా, కార్మిక, విద్యార్థి సంఘాలకు, ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వం జీతాలు పెంచడానికి అంగీకరించి అంగన్‌వాడీ సంఘాలతో ఒప్పందం చేయడం హర్షణీయంగా ఉందన్నారు. అంగీకరించిన అంశాల అమలుకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఎటువంటి కక్షసాధింపులకు పాల్పడకుండా ఉద్యోగుల హక్కులను గౌరవించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ కుయుక్తులను సంఘం అండతో ఉమ్మడిగా ఉద్యోగులంతా ఒక్కటై ఎదిరించడం అభినందనీయమన్నారు. కార్మికుల ఐక్యత, ఇతర సంఘాల,రంగాల కార్మికుల సంఘీభావం, ప్రజల మద్దతు అవసరమని అంగన్‌వాడీ సమ్మె తెలిపిందన్నారు. సమ్మెకు మద్దతు తెలియజేసిన అందరికి సిపిఎం ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు తెలిపారు.

సాయమేదీ లేదు.. ప్రచారం తప్ప..!



ప్రధాన సమస్యల కనీస ప్రస్తావన కరువు
ప్రతిపక్షాలపై ఘాటు విమర్శలు
నిరాశపరచిన ముఖ్యమంత్రి పర్యటన



వైఎస్ఆర్ ఆసరా మెగా చెక్కు విడుదల చేస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి, తదితరులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో జిల్లా కరువుపై స్పందిస్తారని అందరూ ఆశించారు. కాని ఈ ప్రస్తావనే లేకుండానే ఆయన పర్యటన సాగింది. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను వివరించడంతోపాటు, ప్రతిపక్ష టిడిపి, ఇతర పార్టీలను విమర్శించడంతోనే సరిపోయింది. వైఎస్ఆర్ ఆసరా పథకాన్ని ప్రారంభించేందుకు ముఖ్యమంత్రి వైఎ-ఎస్.జగన్మోహన్‌రెడ్డి మంగళవారం నాడు అనంతపురం జిల్లాకు విచ్చేశారు. ఉరవకొండలో జరిగిన సభలో రాష్ట్ర వ్యాప్తంగా మహిళా సంఘాలకు వైఎస్ఆర్ అసరా పథకం కింద రూ.6394 కోట్లను బటన్ నొక్కి ఆయా సంఘాలకు నగదు బదిలీ చేసే కార్యక్రమాన్ని చేపట్టారు. ఎన్నికల సందర్భంలో సాగిన ఈ యాత్ర పూర్తి స్థాయిలో ప్రచార కార్యక్రమంగానే నడించింది. ప్రత్యేక విమానంలో విజయవాడ నుంచి పుట్టపర్తికి విచ్చేసిన ఆయనకు సత్యసాయి జిల్లా నేతలు అక్కడ ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా పుట్టపర్తికి సంబంధించిన టిక్కెట్ల అంశాన్ని ఒకరిద్దరు నేతలు ముందుకు తీసుకురావడంతో ఆయన కొంత అసహనం వ్యక్తం చేసినట్టు సమాచారం. అనంతరం హెలీక్యాప్టర్‌లో ఉరవకొండకు చేరుకున్నారు. ఉరవకొండలో జరిగిన సభలో నియోజకవర్గంకు సంబంధించి కొన్ని సమస్యలను మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వీటిల్లో కొన్నింటినీ వేగవంతంగా అమలు చేస్తామని హామీనిచ్చారు. అంతకు మంచి కొత్త అంశాల ప్రస్తావేది ముఖ్యమంత్రి ప్రసంగంలో లేదు. ప్రధానంగా 2023లో తీవ్రమైన కరువు పరిస్థితులు నెలకొన్నాయి. ఇప్పటికే పంటనష్టం అంచనాలను కూడా ప్రభుత్వం రూపొందించింది. ఈ పరిహారం మంజూరుపై ముఖ్యమంత్రి జిల్లా పర్యటనలో ప్రకటిస్తారని ఆశించారు. కాని కరువు పరిస్థితులకు సంబందించి కనీస ప్రస్తావేది లేదు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించే ఆయన ఎక్కువగా ప్రస్తావించారు. చంద్రబాబు నాయుడుకు మద్దతుగా ఇతర పార్టీల నుంచి కూడా మద్దతును నిలిచే స్టార్ క్యాంపెయినర్లు ఉన్నారని ఆరోపించారు. తనకు ప్రజలే స్టార్ క్యాంపెయినర్లు అంటూ ఒక రకంగా ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. వైసిపికి మద్దతుగా ప్రభుత్వం ద్వారా లబ్ధిపొందిన ప్రతి ఒక్కరూ ప్రచారం చేయాలని పరోక్షంగా సూచించారు. ఈ కార్యక్రమం అనంతరం వైసిపి నాయకులతో చాలా సమయం గడిపారు. ముందుస్తుగానే పాసులు పొందిన వారు ఆయన్ను కలవడానికి పోటీపడ్డారు. వారందరితోనూ ఆయన కలిశారు. ఈ కార్యక్రమంలో గ్రామీణాభివృద్ధి మంత్రి ముత్యాల నాయుడు, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీచరణ్, విద్యుత్, గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీలు తలారి రంగయ్య, గోరంట్ల మాధవ్, ఎమ్మెల్యేలు అనంత వెంకటరామిరెడ్డి, వై.వెంకటరామిరెడ్డి, శంకర నారాయణ, ప్రకాష్‌రెడ్డి, ఎమ్మెల్సీలు శివరామిరెడ్డి, మంగమ్మ, జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్ బోయ గిరిజమ్మ, జిల్లా కలెక్టరు గౌతమి తదితరులు పాల్గొన్నారు.

జగన్ చెప్పాడంటే.. చేస్తాడంతే...

మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్‌రెడ్డి

ప్రజాశక్తి ఉరవకొండ

సిఎం జగన్మోహన్‌రెడ్డి చెప్పాడంటే చేస్తాడంతేనని మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి అన్నారు. మంగళవారం ఉరవకొండలో నిర్వహించిన వైస్సార్ ఆసరా కార్యక్రమంలో సిఎం జగన్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సభలో ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి మాట్లాడారు. సిఎం జగన్ చెప్పితే చేస్తాడంతేనని అన్నారు. ఈ రోజు రాష్ట్రమంతా మన ఉరవకొండ వైపు చూస్తోందని మహిళా సంఘాల సభ్యులు ఎంతో ఆనందంగా ఎదురు చూస్తున్నారని అన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో అసెంబ్లీలో ఇన్‌పుట్ సబ్సిడీపై మాట్లాడానని చెప్పారు. ఆసమయంలో సిఎంగా ఉన్న చంద్రబాబు అది కిరణ్ కుమార్ రెడ్డి ప్రభుత్వం చేసిన అప్పు అని, తాము ఇవ్వమని అన్నారని అన్నారు. అయితే వైసిపి ప్రభుత్వంలో సిఎం జగన్మోహన్‌రెడ్డి జగన్ మాత్రం మహిళల రుణాలకు సంబందించి రూ. 25 వేల కోట్లను ఇచ్చారని అన్నారు. వైసిపి ప్రభుత్వంలో అర్హత ఉంటే చాలు పథకాలు అందుతున్నాయని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ అనుసరిస్తున్న విధానాలను ఈసందర్భంగా ఎండగట్టారు. నాలుగున్నరేళ్ళుగా ప్రజలకు ముఖం చూపకుండా సైబీరియా నుంచి వలస పక్షులు వచ్చినట్లు ఎన్నికలప్పుడు ఇక్కడికి వచ్చి దండాలు పెడతాడని ఎద్దేవా చేశారు. ఈసందర్భంగా నియోజకవర్గంలోని సమస్యలను సభలో ప్రస్తావించిన విశ్వేశ్వరరెడ్డి ఆ సమస్యలను పరిష్కరించాలని సభాముఖంగా ముఖ్యమంత్రికి విన్నవించారు.

నియోజకవర్గానికి వరాల జల్లు : ఉరవకొండ నియోజకవర్గానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి వరాల జల్లు కురిపించారు.మంగళవారం వైస్సార్ ఆసరా కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి సిఎం దృష్టికి పలు సమస్యలు తీసుకెళ్ళగానే వాటిని అక్కడి అక్కడే ఆమోదించారు. వీటిలో ముంపునకు గురైన బెలుగుప్ప మండలం జీడిపల్లి గ్రామ పునర్నిర్మించడానికి అవరమయ్యే చర్యలు వెంటనే చేపట్టాలని అధికారులను ఆదేశించారు.ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కింద ముంపు గ్రామాన్ని రూ.88 కోట్లతో ఆదుకోకున్నట్లు తెలిపారు.హంద్రీనీవా సుజల స్రవంతిలో భాగంగా 75 వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు మిగిలి ఉన్న డిస్ట్రిబ్యూటరీ పనులకు రూ.68 కోట్లు మంజురుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. దీంతో పాటు పెన్నహోబిళంలో బీసీ బాలుర రెసిడెన్షియల్ స్కూలు నిర్మాణానికి రూ.33 కోట్లు మంజురు చేస్తున్నట్లు తెలిపారు.


బహిరంగసభలో మాట్లాడుతున్న విశ్వేశ్వరరెడ్డి

ఉరవకొండ, గుంతకల్లు నియోజకవర్గాల్లో 12 మైనర్ ఇరిగేషన్ ట్యాంకుల నిర్మాణానికి రూ.20 కోట్లు మంజురు చేస్తున్నట్లు సిఎం జగన్మోహన్ రెడ్డి వెల్లడించారు.దీంతో 210 కోట్ల రూపాయలు పనులకు ముఖ్యమంత్రి ఆమోదించినట్లు అయ్యింది. దీనిపై విశ్వేశ్వరరెడ్డి జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు

కులగణనకు సర్వర్ కష్టాలు
ఉదయాన్నే ఇళ్ల వద్ద సచివాలయ సిబ్బంది పడిగాపులు

ప్రజాశక్తి-నార్పల


ఉదయమే ఓ ఇంటి వద్ద వివరాలు సేకరిస్తున్న సచివాలయ సిబ్బంది

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన సర్వేకు సర్వర్ కష్టాలు వెంటాడుతున్నాయి దీంతో సచివాలయ సిబ్బంది, గ్రామ వాలంటీర్లు రోజూ ఉదయాన్నే ప్రజల ఇళ్ల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తోంది. సర్వర్ సమస్యలతో ఒక్కోక్క పేరు నమోదు చేయడానికే గంటల సమయం పడుతోందని సచివాలయ సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కోసారి అసలు పని చేయకపోవంతో ఒక్కో ఇంటికి రెండు, మూడు సార్లు వెళ్లాల్సి వస్తోందని అంటున్నారు. ఉదయం, రాత్రి సమయంలో సర్వర్ కొంచెం వేగంగా ఉంటుందని భావించి వారికి ఇచ్చిన లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు తెల్లవారుజాము నుంచి రాత్రి వరకూ ఇళ్ల వద్ద పడిగాపులు కాస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సర్వర్ సమస్యను పరిష్కరించాలని సచివాలయ సిబ్బందిచ, గ్రామ వాలంటీర్లు కోరుతున్నారు.

పత్తిపంటకు నిప్పు
రూ.3లక్షల వరకూ నష్టం

ప్రజాశక్తి-పెద్దవడుగూరు


అరకొర కాలిన పత్తిని ఏరుతున్న రైతులు

మండలంలోని మల్లేనిపల్లిలో బట్టారంగయ్యకు చెందిన పత్తి పంటకు మంగళవారం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో పూర్తిగా దగ్ధమైంది. బాధిత రైతు తెలిపిన వివరాల మేరకు.. తాను సాగుచేసిన పత్తిపంటను ఓ పాతగృహంలో 50 క్వింటాళ్ల పత్తిని నిల్వ ఉంచుకున్నారు. ఈక్రమంలో పంటకు నిప్పు పెట్టి వెళ్లిపోవడంతో పొగలు వచ్చాయి. గమణించిన స్థానికులు వెంటనే రంగయ్యకు సమాచారం ఇవ్వగా వెళ్లి పరిశీలించారు. అప్పటికే పొగలతో ఇళ్లు నిండిపోయింది. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. గుంతకల్లు నుంచి అగ్నిమాపక యంత్రం వచ్చి మంటలను ఆర్పేలోపు పంట పూర్తిగా దగ్ధమైందని బాధిత రైతు వాపోయాడు. దీంతో సుమారు రూ.3లక్షల దాకా నష్టం వచ్చినట్లు ఆవేదన వ్యక్తంచేశారు. ఈవిషయంపై బాధిత రైతు పోలీసులకు ఫిర్యాదు చేశారు.



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది, పూర్తిగా కాలిన పత్తిపంట

జగన్‌కు ఓటమి భయం
టిడిపికి ప్రజలే స్టార్ క్యాంపెయినర్లు -ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వంతో పీడింపబడిన ఉద్యోగులు, కర్షక, కార్మిక, విద్యార్థులు, ప్రజలే టిడిపికి క్యాంపెయినర్లని ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ అన్నారు. మంగళవారం నగరంలోని టిడిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిఎం జగన్‌కు ఓటమి భయం పట్టుకుందన్నారు. అందుకే దిగజారి చేతగానవాడిగా ప్రతిపక్షాలపై విమర్శలు చేస్తున్నారన్నారు. టిడిపికి మాత్రమే మీడియా, మేధావులు, ఉద్యోగులు, పలు రాజకీయ పార్టీలు స్టార్ క్యాంపైనర్లుగా పని చేస్తున్నారని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రతిపక్షాలను సిఐడితో జైళ్లకు పంపించి ఎంతో ధైర్యవంతుడిని అంటూ వీర్రవీగిన ధైర్యం ఏమైందని ప్రశ్నించారు. అంత బలహీనత ఎందుకు వచ్చిందన్నారు. ప్రజల కోసం పని చేస్తే భయం ఉండదన్నారు. బేళతనం, ప్రజలు తనపై జాలి కనిపించేలా ప్రసంగం కనిపించిందన్నారు. ప్రభుత్వ టెర్రరిజంతో నలిగిపోయిన ప్రతి ఉద్యోగి, ప్రతి రైతు, విద్యుత్ భారాలతో కూదైలైన ప్రజలు, కల్తీ మద్యం జే బ్రాండ్‌లతో తెగిన ప్రతి తాళి, కుటుంబ పెద్దను కోల్పోయిన ప్రతి బిడ్డ, 27 పథకాల రద్దుతో నష్టపోయిన ప్రతి దళితులు, 30 పథకాల రద్దుతో వెన్నెముక విరిగిన బిసిలు, దమన కాండకు బలైన నంద్యాల అబ్దుల్ సలాం నుంచి ప్రతి ముస్లిం మైనార్టీలు, హత్య గావింపబడిన దళిత బిడ్డ డాక్టర్ సుధాకర్, డ్రైవర్ సుబ్రమణ్యం, కావళిలో కరుణాకర్ వరకు టిడిపికి స్టార్ క్యాంపైనర్‌లే అన్నారు. ఉచిత ఇసుకను బంగారంగా మార్చి సొంత ఇంటి కళను దూరమైన ప్రతి లబ్ధిదారుడు స్టార్ క్యాంపైనర్‌లేనని, అంగన్‌వాడీలు, ప్రభుత్వ ఉద్యోగులు, ప్రతి పోలీస్ టోపీ స్టార్ క్యాంపైనర్‌లే అన్నారు. విశాఖ పట్టణం నుంచి ప్రతి జిల్లాలో భూములను గద్దల్లాగా వాలి కబ్జా చేస్తున్న వారందరూ మీకు స్టార్ క్యాంపైనర్‌లే అన్న విషయాన్ని ముఖ్యమంత్రి జగన్ తెలుసుకుని మాట్లాడాలన్నారు. ఉరవకొండ నియోజకవర్గం అభివృద్ధికి వడివడిగా అడుగులు పడతాయంటూ చెప్పడం ఎవరిని మోసం చేయడానికి అంటూ ప్రశ్నించారు. భైరవాని తిప్ప, పేరూరు ప్రాజెక్టు ఏమి చేశారో చెప్పారా అంటూ ప్రశ్నించారు. వైసిపి నియోజకవర్గం ఇన్‌చార్జి విశ్వేశ్వరరెడ్డి నాలుగున్న సంవత్సరాల కాలంలో చేసిన అభివృద్ధి శూన్యం అన్నారు. ఇళ్ల పట్టాలు, ఇళ్లు నిర్మాణాలంటూ కళ్లబొల్లి మాటలతో మోసపూరిత మాటలతో ప్రజలను నమ్మించే చర్యలకు ప్రజలు చెక్ పెట్టే రోజులు దగ్గర పడ్డాయని తెలిపారు.అసమర్థత వల్ల ప్రజలు తీవ్రంగా నష్టపోయారని ఇక ముందు నష్టపోవడానికి సిద్ధంగా లేరన్న విషయాన్ని గుర్తించుకోవాలని హితవు పలికారు.


సిఎంకు బొకే అందజేస్తున్న వీరా, లిఖిత

సిఎంను కలిసిన పామిడి వీరా

అనంతపురం : వైఎస్ఆర్ ఆసరా కార్యక్రమంలో భాగంగా ఉరవకొండకు విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని ఎడిసిసి బ్యాంకు మాజీ ఛైర్మన్ పామిడి వీరా కలిశారు. ఇందులో భాగంగా బొకే అందజేసి స్వాగతం పలికారు. ఆయనతోపాటు కూతురు, ఎడిసిసి బ్యాంకు ఛైర్‌పర్సన్ లిఖిత ఉన్నారు.

25న తహశీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నా
పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షులు పెద్దన్నగౌడ్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 25న జిల్లాలోని తహశీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నాలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన, కార్యదర్శులు బి.పెద్దన్నగౌడ్, శీలా జయరామప్ప తెలిపారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈనెల 21న గుంటురులో నిర్వహించిన కార్యవర్గ సమావేశానికి జిల్లా కమిటీ హాజరై పెన్షనర్ల సమస్యలపై చర్చించినట్లు తెలిపారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పలు తీర్మాణాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిందన్నారు. ఈనేపథ్యంలో సమస్యల పరిష్కారానికి ఈనెల 25న తహశీల్దార్ కార్యాలయాల ఎదుట, 29న కలెక్టరేట్ ఎదుట ధర్నాలు చేయనున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి 5న విజయవాడలో రాష్ట్రస్థాయిలో పెద్దఎత్తున ధర్నా చేయనున్నట్లు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో పెన్షనర్లు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

అంగన్వాడీల సంబరాలు

సమ్మె విరమణ , విధుల్లోకి అంగన్‌వాడీలు
సమ్మెకు సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు
ఆట,పాటలతో ఆనందంగా కేరింతలు, ధన్యవాదాలు


సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వి. రాంభూపాల్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

అంగన్‌వాడీ కార్మికులు న్యాయమైన డిమాండ్ల సాధన కోసం 43 రోజులుగా చేపట్టిన నిరవదిక సమ్మె నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం జరిపిన చర్చలు సఫలవంతం కావడంతో కార్మికులు సమ్మెను విరమించారు. సోమవారం రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కార్మికుల యూనియన్ రాష్ట్ర నాయకులతో చర్చలు జరిపింది. 11 డిమాండ్లలో 10 డిమాండ్‌లు ఇప్పటికే పరిష్కరించామని, జూలైలో వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చింది. దీంతో అంగన్‌వాడీలు నిరవదిక సమ్మెను విరమించినట్లు ప్రకటించారు. అందులో భాగంగా మంగళవారం అనంతపురం కలెక్టరేట్ ఎదుట సమ్మె విజయవంతం కోసం సహకరించిన వారికి అభినందన సభ నిర్వహించారు. అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు శకుంతల అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్ని అవాంతరాలు సృష్టించినా అనేక బెదిరింపులకు దిగినా మొక్కవోనిదీక్షతో అంగన్‌వాడీ కార్మికులు చేపట్టిన సమ్మె పోరాటం ఫలించిందన్నారు. ఎన్నో కష్టాలు, నష్టాలను ఓర్చి అంగన్‌వాడీలు పోరాటం చేశారని కార్మికులందరికి అభినందనలు తెలిపారు.. కార్మికుల పోరాట పటిమ ముందు ప్రభుత్వం దిగిరాక తప్పలేదన్నారు. న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని కార్మికులు చేపట్టిన సమ్మెకు రాజకీయ పార్టీలు, కార్మిక, రైతు, విద్యార్థి, ప్రజా సంఘాలు సంపూర్ణ మద్ధతు ఇవ్వడం చరిత్రలో నిలిచిపోయిందన్నారు. అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమాదేవి మాట్లాడుతూ సమ్మెకు సహకరించిన వారందరికి ధన్యవాదాలు తెలిపారు. ఆలస్యంగానైనా న్యాయం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయడంపై ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పోలీస్ అధికార యంత్రాంగానికి ధన్యవాదాలు తెలిపారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగంద్రకుమార్ మాట్లాడుతూ అంగన్‌వాడీల పోరాటం భవిష్యత్ తరాలకు మార్గదర్శకంగా నిలిచిందన్నారు. అనంతరం అంగన్‌వాడీ కార్మికులు నాయకులు కేక్ కట్ చేసి పంచుకుని తిని ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఆట పాటలు కేరింతల పోరాట విజయాన్ని ఆస్వాదించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షురాలు ఎం.నాగమణి, జిల్లా కోశాధికారి గోపాల్, నగర కార్యదర్శులు ముత్తుజా, వెంకటనారాయణ, మన్నీల రామాంజినేయులు, అధ్యక్షులు శ్రీనివాసులు, సిపిఎం నగర కార్యదర్శులు వి.రామిరెడ్డి, ఆర్‌వి.నాయుడు, శివశంకర్, ఆవాజ్ జిల్లా కార్యదర్శి ముస్కిన్, ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి, జిల్లా ఉపాధ్యక్షురాలు రామాంజినమ్మ, పండ్ల తోటల రైతు సంఘం జిల్లా కార్యదర్శి శివారెడ్డి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు నాగభూషణం, జిల్లా అధ్యక్షులు ఎటిఎం.నాగరాజు, కెవిపిఎస్ వెంకటేష్, మెడికల్ రెప్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి మనోహర్, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నగర కార్యదర్శి జమున, అరుణమ్మ, కాత్యాయని, రుక్మిణి, పాతక్క, విజయమ్మ, విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.


అభినందన సభలో అంగన్వాడీల విజయ హర్షాతిరేకాలు

అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు

సిఎం పర్యటన నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా నాయకుల అరెస్టు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సిఎం జగన్ అనంతపురం జిల్లా పర్యటనకు వచ్చిన నేపథ్యంలో పలు రాజకీయ పార్టీలు, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, ప్రజా సంఘాల నాయకులకు పోలీసులు మంగళవారం ముందస్తు నోటీసులు ఇవ్వడంతోపాటు గృహ నిర్బంధాలు, ముందస్తు అరెస్టులు చేశారు. అంగన్‌వాడీ కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ 42 రోజులుగా సమ్మె చేపట్టిన నేపథ్యంలో ప్రభుత్వం పరిష్కరించకుండా వివిధ రూపాల్లో అణచివేతకు గురిచేయడం, బెదిరింపులకు దిగడాన్ని నిరసిస్తూ సిపిఎం, సిఐటియు నాయకులు సిఎం పర్యటనను అడ్డుకుంటామని సోమవారం రాత్రి ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో సోమవారం రాత్రి నుంచే సిపిఎం నేతలకు పోలీసులు ముందస్తు నోటీసులు అందజేశారు. ఇందులో భాగంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్, సిఐటియు నాయకులు మన్నీల రామాంజి, సిఐటియు జిల్లా అధ్యక్షురాలు ఎం.నాగమణి, సిపిఎం నగర కార్యదర్శులు ఆర్‌వి.నాయుడు, వి.రామిరెడ్డి, ఉరవకొండ సిపిఎం జిల్లా నాయకులు రంగారెడ్డి, మండల కార్యదర్శి మధు, విద్యార్థి సంఘం నాయకులు సిద్ధు, వెంకి, సిద్ధార్థ, వజ్రకూరు మండల కార్యదర్శి విరూపాక్షి, ఆత్మకూరు శివశంకర్, రాయదుర్గం మల్లికార్జున, డిహీరేహాల్ లోకేష్, మల్లికార్జున, కణేకల్ నాగరాజు, కళ్యాణదుర్గం అచ్యుత్‌కు ముందస్తు నోటీసులు అందజేశారు.

ఉరవకొండ : ముందస్తుగా అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు రంగారెడ్డి, యూట్యూబ్ జిల్లా సహాధ్యక్షులు రామప్పచౌదరి, జిల్లా కార్యదర్శి సంజీవ్‌కుమార్, మండల నాయకులు నాగరాజు, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి సిద్ధార్థ, సిపిఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి చెన్నరాయుడు, డిజిహెచ్ఎస్ అధ్యక్షులు గోపాల్ హెచ్చరించారు. సిఎం జగన్ ఉరవకొండ పర్యటన సందర్భంగా సోమవారం తెల్లవారుజామున పోలీసులు నాయకుల ఇళ్ల వద్దకు వచ్చి ముందస్తు నోటీసులు అందజేశారు. మరికొంతమందిని పోలీస్‌స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు నచ్చినట్టు పాలన సాగించి ప్రజామన్ననలు పొందాలే తప్ప ఉద్యమకారుల గొంతు నొక్కడం సరికాదన్నారు. ఎన్నో సంవత్సరాలుగా ఉన్న ఎస్సీ, ఎస్టీల పథకాల అన్ని రద్దు చేసి వారి మనుగడను దెబ్బతీసిన జగన్‌రెడ్డికి త్వరలోనే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఇందులో భాగంగా ఎంఆర్‌పిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కౌకుంట్ల రవి, జిల్లా పార్లమెంట్ అధ్యక్షులు రాయంపల్లి వెంకటేశులు, ఉరవకొండ తాలూకా అధ్యక్షులు రాంపురం చెన్నప్ప, ప్రధాన కార్యదర్శి కౌకుంట్ల సురేష్, ఎస్సీ,ఎస్టీ ఐక్యవేదిక రాష్ట్ర నాయకులు మధు ప్రసాద్ అరెస్టు చేసి ఉరవకొండ, వజ్రకరూరు పోలీస్‌స్టేషన్లకు తరలించారు.

యుటిఎఫ్ నాయకులు అరెస్టు

సిఎం పర్యటన నేపథ్యంలో మంగళవారం తెల్లవారుజామున ఉరవకొండలో యుటిఎఫ్ నాయకులను అరెస్టు చేశారు. ఇందులో భాగంగా తెల్లవారుజామునే యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు రామప్ప, జిల్లా కార్యదర్శి సంజీవ్‌కుమార్, జిల్లా కౌన్సిలర్ నాగరాజు ఇళ్లకు వెళ్లి అరెస్టు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిఎం పర్యటన సందర్భంగా ముందస్తు అరెస్టులకు పాల్పడటం బాధాకరమన్నారు. ఉదయం లేవగానే పాఠశాలకు వెళ్లాల్సిన ఉపాధ్యాయులను ప్రభుత్వం పోలీసులతో అరెస్టులు చేయించి పోలీస్‌స్టేషన్‌లో పెట్టడం అప్రజాస్వామికంగా ఉందన్నారు. వ్యక్తి అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తపరచడానికి రాజ్యాంగం ప్రజలకు కల్పించిన హక్కు అన్నారు. ఆ హక్కును ప్రభుత్వాలు హరించే చర్యలకు పాల్పడటం సరికాదన్నారు. 42 రోజులగా అంగన్‌వాడీలు పోరాడి హక్కులు సాధించుకున్నారని, అంగన్‌వాడీలకు అభినందనలు తెలిపారు. ఉద్యోగ ఉపాధ్యాయులు, పెన్షనర్‌లకు రావాల్సిన ఆర్థిక బకాయిలు సాధన కోసం నేడు చేపట్టిన ర్యాలీలో ఉపాధ్యాయులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.



ఉరవకొండలో పోలీసుల అదుపులో ఉన్న యుటిఎఫ్ నాయకులు

గుంతకల్లు : సమస్యలు పరిష్కరించడంలో విఫలమైన వైసిపి పోలీసు వ్యవస్థను అడ్డం పెట్టుకుని ప్రభుత్వం నడుపుతోందని వామపక్షాల నాయకులతోపాటు విద్యార్థి సంఘాల నాయకులు విమర్శించారు. సిఎం జగన్ ఉరవకొండ పర్యటన సందర్భంగా సిపిఎం, సిపిఐ, ఎస్ఎఫ్ఐ నాయకులను మంగళవారం తెల్లవారుజామున ఇళ్లకు వచ్చి అక్రమంగా అరెస్టు చేసి పోలీసుస్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు, సిపిఐ జిల్లా నాయకులు బి.గోవిందు మాట్లాడుతూ అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపాలని చూడటం అవివేకమన్నారు. ఉద్యమాలను ఎంత అణచాలని చూస్తే అంత ఉవ్వెత్తున ఎగిసిపడతాయన్నారు. అరెస్టు అయిన వారిలో సిపిఎం నాయకులు మారుతీప్రసాద్, సిఐటియు నాయకులు కె.నరసయ్య, సాకే నాగరాజు, ఏసు, సిపిఐ పట్టణ కార్యదర్శి గోపీ, నాయకులు గౌస్, మండల కార్యదర్శి పి.రాముదాయల్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సి.రమేష్, సిపిఐ మండల సహాయ కార్యదర్శి రామాంజనేయులు యాదవ్, ఎఐటియుసి మండల అధ్యక్షులు టి.సురేష్, తదితరులు పాల్గొన్నారు.



గుంతకల్లులో పోలీసుల అదుపులో ఉన్న వామపక్షాల నాయకులు

వ్యవసాయానికి స్మార్ట్ మీటర్లు వద్దు

ప్రజాశక్తి-పామిడి

వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగించే విధానాన్ని తక్షణమే ఉపసహకరించుకోవాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం స్థానిక ఎపి ట్రాన్స్‌కో ఎఇ మధుసూదన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా సమితి సభ్యుడు రహీం మాట్లాడుతూ రాష్ట్రంలో తీవ్ర కరువు పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. గత 50ఏళ్లలో లేని కరువు ఈసారి వచ్చిందన్నారు. వర్షాలు సరిగా కురవకపోవడంతో పంటలు పూర్తిగా ఎండిపోతున్నాయన్నారు. ఫలితంగా రూ.లక్షల్లో పంట నష్టం జరిగిందన్నారు. ఈ సమయంలో కేంద్రం వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగించాలని చూడటం బాధాకరమన్నారు. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం వంతుపాడటం విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి వ్యవసాయ మెటాలర్లకు మీటర్లు బిగించే విధానాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు పి.చౌడప్ప, మండల కమిటీ సభ్యుడు నాగరాజు, వెంకటరామిరెడ్డి, రాముడు, తదితరులు పాల్గొన్నారు.

నేడు భోగేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-పామిడి

మండల కేంద్రం సమీపంలోని పెన్నానది ఒడ్డున ఉన్న భోగేశ్వరస్వామి ఆలయ విమాన గోపురం, ఆలయ పునర్నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన చేయనున్నట్లు ఆలయ కమిటీ ఛైర్మన్ మురళీధరగుప్తా, ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ అంగదాల క్రిష్ణయ్య, ప్రధాన అర్చకులు రామేశ్వరశర్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, జిల్లా మంత్రి ఉషశ్రీచరణ్, ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. ఆలయ పునర్నిర్మాణం కోసం సి.జి.ఎఫ్ నిధులు రూ.కోటి, భక్తుల సేకరించిన రూ.40లక్షల విరాళాలతో పనులు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్సీలు వై.శివరామిరెడ్డి, మంగమ్మ, రామచంద్రారెడ్డి, భూమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, ఎడిసిసి బ్యాంకు ఛైర్‌పర్సన్ లిఖిత, గుత్తి మార్కెట్ యార్డు ఛైర్మన్ సునీల్‌యాదవ్, మండలాధ్యక్షులు భోగాతి మురళీమోహన్‌రెడ్డి, జడ్పిటిసి లావనూరు శోభారాణి తదితరులు హాజరవుతారన్నారు. కావున భక్తులందరూ పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

రోసిరెడ్డి మృతికి నివాళి

శింగనమల : మండలంలోని ఏకులనాగేపల్లి గ్రామానికి చెందిన టిడిపి అనంతపురం పార్లమెంట్ అధికార ప్రతినిధి కోటిరెడ్డి తండ్రి రోసిరెడ్డి మృతికి పలువురు టిడిపి నాయకులు మంగళవారం నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో టిడిపి నాయకులు ముంటిమడుగు కేశవరెడ్డి, రామలింగారెడ్డి, దండు శ్రీనివాసులు, దాసరి గంగాధర్, కుళ్లాయప్ప, ఆదినారాయణ, బండి పరుశురాం, సతీష్‌రాయల్, ప్రసాద్‌నాయక్, దండు ప్రకాష్, వడ్డే పవన్, సోము, తదితరులు పాల్గొన్నారు.

జగన్‌ను మరోసారి సిఎంను చేయడమే లక్ష్యం

మంత్రి ఉషశ్రీ చరణ్

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

వైసిపి అధినేత జగన్మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయడమే అంతిమ లక్ష్యమని మంత్రి ఉషశ్రీచరణ్ అన్నారు. మంగళవారం కళ్యాణదుర్గంలోని ఎంపీ, నియోజకవర్గ సమన్వయకర్త తలారి రంగయ్య స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ సిఎం జగన్ పార్టీ గెలుపు కోసం అభ్యర్థులు మార్చారన్నారు. అంతేతప్ప ఎలాంటి పక్షపాతం చూపించలేదన్నారు. కళ్యాణదుర్గం ఎమ్మెల్యేగా తలారి రంగయ్య, అనంతపురం పార్లమెంట్ అభ్యర్థిగా శంకరనారాయణను గెలిపించడం లక్ష్యంగా కార్యకర్తలు, నాయకులు పని చేయాలని పిలుపునిచ్చారు. రాయదుర్గం ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డిపై స్పందన అడగ్గా దాటేస్తూ వెళ్లిపోయారు. ఈ కార్యక్రమంలో మాజీమంత్రి, అనంతపురం పార్లమెంట్ అభ్యర్థి శంకరనారాయణ, వైసిపి జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్య, నియోజకవర్గ పరిశీలకులు ఎంఆర్‌సి.రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



విలేరులతో మాట్లాడుతున్న వైసిపి నాయకులు



వ్యవసాయ పుస్తకాలను ఆవిష్కరిస్తున్న వ్యవసాయ క్షేత్రం సభ్యులు

నూతన వంగడాలపై రైతులతో ముఖాముఖి

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

మండలంలోని రేకులకుంట వ్యవసాయ క్షేత్రంలో ఉప కులపతి డాక్టర్ శారద జయ లక్ష్మీదేవి అధ్యక్షత మంగళవారం ఏర్పాటు చేసిన కిసాన్‌మేళా కార్యక్రమంలో భాగంగా నూతన వంగడాలపై రైతులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు సంబంధించి డ్రోన్లు, మందులు, వ్యవసాయ యాత్రీకరణ, విత్తనాలు, పురుగుల మందులపైన స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పరిశోధన సంచాలకులు ఎల్.ప్రశాంతి, ఎ.సుబ్బరామిరెడ్డి, పాలకమండలి సభ్యులు మల్లికార్జునరెడ్డి, మురళీధర్‌రెడ్డి, డిఎఇ పద్మలత, ఎంపిపి దాసరి సునీత, వైస్ ఎంపిపి సాకే వెంకటలక్ష్మి, రేకులకుంట సర్పంచి, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

మాదిగల మహా సమ్మేళనాన్ని జయప్రదం చేయండి

ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర కార్యదర్శి సాకే ఓబులేసు

ప్రజాశక్తి-పామిడి

జిల్లాకేంద్రంలో ఈనెల 31న సాయినగర్‌లో ఉన్న అంబేద్కర్ భవనంలో నిర్వహించనున్న మాదిగల మహా సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఎపి ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర కార్యదర్శి సాకే ఓబులేసు పిలుపునిచ్చారు. మంగళ వారం ఈమేరకు మండల కేంద్రంలోని వెంగమనాయుడు కాలనీలో ఇందుకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. రాజ్యాధికారానికి రాని కులాలు అంతరించిపోతాయని అంబేద్కర్ మహనీయుడు ఆనాడే చెప్పారన్నారు. మన హక్కుల సాధనకు మాదిగలకు ఉన్న శక్తిని చాటడానికి ఇంత కన్నా మంచి అవకాశం మరెప్పుడూ రాదన్నారు. ఏడు దశాబ్దాల స్వతంత్ర భారత అభివృద్ధిలో మనకు దక్కిందేంటని నిలదీశారు. తరాలు మారినా అమానవీయ వృత్తుల్లోనే ఎందుకింకా మగ్గుతున్నామన్నారు. ఎంత కాలమిలా వెట్టి ఉద్యోగాలతో సంతృప్తి పడుతూ జీవితాలు నెట్టుకొద్దామన్నారు. మాదిగ జాతి బిడ్డలారా సంఘటితమై ఉమ్మడి అనంతపురం జిల్లా మాదిగల ఐక్యత చాటుదామన్నారు. మండల వ్యాప్తంగా మాదిగ జాతి ప్రజలందరూ సమ్మేళనానికి వచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

విరాళం అందజేత

రాయదుర్గం రూరల్ : మండల పరిధిలోని ఆయతపల్లిలో మారెమ్మ ఆలయం నిర్మాణానికి వాల్మీకి సంక్షేమ సేవా సమితి అధ్యక్షులు బండి కిష్టప్ప మంగళవారం రూ.5100 విరాళం అందజేశారు.

అనంతలో భారీ బైక్‌ర్యాలీ

అనంతపురం కలెక్టరేట్ : టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ జన్మదిన వేడుకలను జిల్లావ్యాప్తంగా ఆపార్టీ శ్రేణులు మంగళవారం ఘనంగా జరుపుకున్నాయి. ఇందులో భాగంగా అనంతపురంలో మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌చౌదరి కుమారుడు వైకుంఠం మధుకర్ చౌదరి ఆధ్వర్యంలో వెయ్యి బైకులతో భారీ ర్యాలీ నిర్వహించారు. పార్టీ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ రాంనగర్ బ్రిడ్జి, సప్తగిరి సర్కిల్, టవర్ క్లాక్ మీదుగా ఎన్టీఆర్ విగ్రహం వరకూ సాగింది. అనంతరం ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి భారీ కేక్ కోసి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో టిడిపి నగర అధ్యక్షులు మారుతీకుమార్‌గౌడ్, ముస్లిం మైనారిటీ సీనియర్ నాయకులు సాలార్ బాషా, దేవళ్ల మురళి, డిష్ నాగరాజు, నటేష్‌చౌదరి, నారాయణస్వామి యాదవ్, రాజారావు, సుధాకర్ యాదవ్, బొమ్మినేని శివ, డైమండ్ రఫీ, వన్నూరప్ప, మార్కెట్ మహేష్, గోపాల్‌గౌడ్, జెఎం.బాషా, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం : నారా లోకేష్ వాలంటరీ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నగరంలోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు వ్యవస్థాపకులు కొత్తకోట ఖాసీం, సభ్యులు, పలు టిడిపి నాయకులు బాబు, చందు, హుసేన్‌పీరా, ఓబులేసు, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు. అలాగే అర్బన్ బ్యాంకు ఛైర్మన్ జె.ఎల్.మురళీధర్ ఆధ్వర్యంలో కేక్ కోసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు డైరెక్టర్ దేరంగుల వెంకటాద్రి, వి.జి.లోకనాథ్, మణి, సుబ్రమణ్యం, ఎన్‌బికె ఫ్యాన్స్ అధ్యక్షులు శ్రీధర్‌రాయల్, అనిల్‌నాయుడు, సునీల్‌రాయల్, శంకర్‌నారాయణ, ఉదయ్ కుమార్, మహమ్మద్ ఖాజా, అకుల్ యాదవ్, నారాయణ రాయల్, స్వామి తదితరులు పాల్గొన్నారు. అలాగే రాయదుర్గం, శింగనమల, బుక్కరాయసముద్రం, నార్పల మండలాల్లో నారా లోకేష్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.



అన్నదానం చేస్తున్న నారా లోకేష్ వాలంటరీ ఆర్గనైజేషన్ సభ్యులు

In Tha Court of The Prl.District Judge, Ananthapuramu E.P. No. 419/2023 in O.S. No. 123/2017. **Between:** M.Erabai W/o Reddy Prasad, R/of D.No:2-128/A, Navodaya Colony, Ananthapuramu City and District. ...Petitioner/D.Hr And Kammara Madhavi W/o Kammara Krishnama Chari R/at D.No:2-128, Kandukuru Village, Ananthapuramu Rural Mandal ...Respondant/J.Dr వేలం ప్రకటన అర్జీదారుడు తన E.P మొత్తమును రాబట్టుటకు ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని పై తెలిపిన కోర్టులో వేలమునకు తెచ్చియున్నారు. వేలంలో పాల్గొనదలచిన వారు 09/02/2024 వ తేది ఉదయం 10:30 గం॥లకు పై కోర్టులో హాజరై కోర్టు షరతులకు లోబడి వేలంలో పాల్గొనవచ్చును. **SCHEDULE** Property Situated within the R.D of Ananthapuramu and SRD of Ananthapuramu Rural, within the Kandukuru Village Limits Babu:Govt.Dry, Sy.No:175, Extent:A.C:1.03 Cents Paiki Plot No:19 Paiki West Side Extent:0.051/2 Cents Paiki Extent 0.01 1/4 Cents.H.S.0.006, House Plot including the House Constructed therein with bearing D.No:2-128, Measuring 15X37 within the following boundaries. which are Common for The House Site and The House East:Remining Extent of Same Plot, South:House of Mustur Siva Reddy, West:Chenna Kesava Swamy Temple, North:Road, Measuring:East-West:15 feet or 4.57 Meters, North-South:37 feet or 11.28 Meters **Ameen Value of Rs : 25,00,000/-** **D.Hr Value of Rs : 32,00,000/-** (By Order of The Court) P.GURU PRASAD, P.SUDHARSHANA CHARI, V.MANJULA, ADVOCATES, ANANTHAPURAMU

In the court of the Junior Civil Judge:Tadipatri O.S.No:104/2023 **Between:** K.Mahananda Reddy ...Plaintiff And K.Nagaraju ...Defendant ప్రతివాదికి దావా సమను To Koneati Nagaraju S/o K.Sreeramulu, D.No:10/95-A, Etigaddapalem, Tadipatri Town, Ananthapuramu Dist, పై దావాలో వాది తన బాకీ మొత్తం రాబట్టుకొనుటకు పై కోర్టులో మీపై దావా వేసియున్నారు. సదరు దావా మీ హాజరు నిమిత్తం 05/02/2024 నాడు కోర్టు వారు వాయిదా వేసినారు. సదరు దావాలో మీకు ఏమైన అభ్యంతరాలు ఉండిన యెడల మీరు స్వయంగా గానీ, వకీలు ద్వారా గానీ పై కోర్టు వారి ఎదుట పై తేది నాడు ఉదయం 10:30 గం॥లకు హాజరు అయి తెలుపుకొనవచ్చును. అట్లు లేని యెడల సదరు దావా మీ పరోక్షమున తీర్మానం చేయబడును. (కోర్టు వారి ఉత్తర్వుల మేరకు) **R.C.RAJANIKANTH REDDY,** **Advocate, Tadipatri.** **Cell:9440287244,7989610291**

నేతాజీ సుభాష్ చంద్రబోస్‌కు నివాళి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని పురస్కరించుకుని మంగళవారం జిల్లా కేంద్రంలోని కేంద్ర గ్రంథాలయంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రంథాలయం సంస్థ ఛైర్‌పర్సన్ ఎల్ఎం. ఉమామోహన్‌రెడ్డి మాట్లాడుతూ సుభాష్ చంద్రబోస్ 21 ఏళ్ల నుంచి స్వాతంత్ర్యం కోసం పోరాటంలో పాల్గొన్నారన్నారు. ఇందులో భాగంగా ప్రతి భారతీయుడినీ సైనికునిగా మార్చి స్వాతంత్ర్య పోరాటంలో చేసిన ఘనత ఆయనకే దక్కిందనానరు. ఆయన్ను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షులు ఎల్ఎం.మోహన్‌రెడ్డి, ఉప గ్రంథాలయ అధికారి వి.సుబ్బరత్నమ్మ, సిబ్బంది ఇంతియాజ్ అహమ్మద్, శిరీషా, ఇందిరమ్మ, హేమమ్మలి, విద్యార్థులు, గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు.



గుత్తిలో నేతాజీకి నివాళులర్పిస్తున్న జెవివి నాయకులు

గుత్తి : నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని పురస్కరించుకుని జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని విగ్రహానికి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో శ్రీసాయి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ సి.వెంకటేశ్వర్లురెడ్డి, జెవివి మండల ప్రధాన కార్యదర్శి పి.వెంకటరామిరెడ్డి, అధ్యక్షులు ఎ.రామాంజనేయులు, నాయకులు గైడ్ రమేష్, మారాకుల రమణ, తదితరులు పాల్గొన్నారు.

కవిశేఖర ఉమర్ అలీషాకు నివాళి

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని నెహ్రూ యువ కేంద్రం కార్యాలయంలో కవి శేఖర డాక్టర్ ఉమర్ అలీషా వర్థంతిని పురస్కరించుకుని చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీనియర్, రచయిత డాక్టర్ పతికి రమేష్ నారాయణ, నెహ్రూ యువ కేంద్రం పోగ్రాం ఇన్‌ఛార్జి జి.శ్రీనివాసులు, రాష్ట్రపతి అవార్డు గ్రహీతలు బిసాటి భరత్, బిసాటి జీవన్‌కుమార్, కె.జయమారుతి, ఉమర్ అలీషా సాహితీ సమితి అనంతపురం కార్యదర్శి సుంకర రమేష్, సభ్యులు మహేంద్ర ధోని, దబ్బర శ్రీకాంత్, రూబీఖాన్, సాయినాథ్, నందిత, పవన్, తదితరులు పాల్గొన్నారు.



అలీషాకు నివాళులర్పిస్తున్న నెహ్రూ యువకేంద్రం సభ్యులు

రిక్రియేషన్ క్లబ్ అధ్యక్షులుగా లక్ష్మీకాంతరెడ్డి



రాయదుర్గం : రాయదుర్గం రిక్రియేషన్ క్లబ్, రీడింగ్ రూమ్ నూతన అధ్యక్షులుగా ఆర్‌టి.లక్ష్మీకాంతరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 2024-25 సంవత్సరానికి ఎలక్షన్ ఆఫీసర్ అరవ శివప్ప ఆధ్వర్యంలో బుధవారం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడితోపాటుఉపాధ్యక్షులుగా మోపురి వెంకటేష్ రాజు, ప్రధాన కార్యదర్శిగా గాజుల నారాయణస్వామి, సహాయ కార్యదర్శిగా కె.నాగరాజును ఎన్నుకున్నట్లు ఎలక్షన్ ఆఫీసర్ శివప్ప తెలిపారు.

ఘనంగా పెద్దమ్మ జాతర

పెద్దవడుగూరు : మండలంలోని విరుపాపురంలో గ్రామపెద్దల ఆధ్వర్యంలో మంగళవారం పెద్దమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామస్తులు బోనాలతో పూజలు ఆచరించారు.

అంగన్వాడీల విజయోత్సవ సంబరాలు

ప్రజాశక్తి-ఉరవకొండ

రాష్ట్ర ప్రభుత్వం చర్చలు సఫలం కావడంతో మంగళవారం విడపనకల్ మండల కేంద్రంలో అంగన్వాడీలు సంబరాలు చేసుకున్నారు. ఇందులో భాగంగా మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో యూనియన్ నాయకులు విజయ, అరుణకాంతమ్మ, దుర్గాదేవి ఆధ్వర్యంలో కేక్ కోసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ముందుకు రావడం శుభ సూచికమన్నారు. 42 రోజులపాటు అంగన్వాడీలు సమ్మె చేయడంతో ప్రభుత్వం స్పందించి సమస్యల పరిష్కారానికి ముందుకు రావడంతో హర్షం వ్యక్తం చేశారు. తమ సమ్మెకు మద్దతుగా నిలిచిన సిఐటియు, సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్, టిడిపి, వివిధ కుల సంఘాల నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

పుట్లూరు : అంగన్వాడీల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా వ్యవహరించడం పట్ల మండల కేంద్రంలో సంబరాలు చేసుకున్నారు. ఇందులో భాగంగా మంగళవారం సిపిఎం ఆధ్వర్యంలో కేక్ కోసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా సిపిఎం మండల అధ్యక్షులు ఎస్.సూరి మాట్లాడుతూ దాదాపు 42 రోజులు ఎన్ని ఇబ్బందులు వచ్చినా, ఎన్ని బెదిరింపులు వచ్చినా.. అంగన్వాడీలు పోరాడి సమస్యలు పరిష్కరించుకోవడం సంతోషకరమన్నారు ఈ కార్యక్రమంలో రైతుసంఘం కార్యదర్శి జి.వెంకటచౌదరి, వ్య.కా.సం మండల అధ్యక్షుడు టి.పెద్దయ్య, కెవిపిఎస్ కె.నాగభూషణ్, రైతుసంఘం నాయకులు భాస్కర్‌రెడ్డి, అంగన్వాడీ మండల అధ్యక్షురాలు జయలలిత, అనంతలక్ష్మి, రమాదేవి, శశికళ, అంగన్వాడీలు, తదితరులు పాల్గొన్నారు.

పామిడి : సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా స్పందించడంతో మంగళవారం మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఉన్న నిరసన శిబిరం వద్ద అంగన్వాడీలు కేక్ కోసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు అనిమిరెడ్డి, మల్లేష్, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రాయదుర్గం : అంగన్వాడీలు ప్రభుత్వంతో పోరాడి విజయం సాధించిన సందర్భంగా మంగళవారం పట్టణంలోని ఎంపిడిఓ కార్యాలయం ఎదురుగా మండల అంగన్వాడీలు, హెల్పర్లు కేక్ కోసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి బి.మల్లికార్జున మాట్లాడుతూ సిఐటియు అండతో అంగన్వాడీలు రాజీలేని పోరాటం చేసి సాధించిన విజయం అన్నారు.. ఎంతటి మొండి ప్రభుత్వమైనా.. ముఖ్యమంత్రి అయిన.. మెడలు వంచి హక్కులు సాధించుకుంటామని చాటి చెప్పిన ఈ పోరాటం చిరస్థాయిగా గుర్తుండి పోతుందన్నారు.



ఉరవకొండలో సంబరాలు చేసుకుంటున్న అంగన్వాడీలు

పెద్దవడుగూరు : అంగన్వాడీలకు ప్రభుత్వం వేతనాలను పెంచుతామని హామీ ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేస్తూ మంగళవారం పెద్దవడుగూరులో సంబరాలు చేసుకున్నారు. ఇందులో భాగంగా కేక్ కోసి పంచిపెట్టారు. ఈ కర్యాక్రమంలో సిపిఎం నాయకులు దస్తగిరి, ఈశ్వరరెడ్డి, సిపిఐ నాయకుడు సూర్యనారాయణరెడ్డి, అంగన్వాడీ యూనియన్ నాయకురాళ్లు పుష్పలత, చరిత, భాగ్యలక్ష్మి, స్వప్న, సంజీవమ్మ తదితరులు పాల్గొన్నారు.



పామిడి, పుట్లూరు, రాయదుర్గంలో కేక్‌కోసి సంబరాలు చేసుకుంటున్న అంగన్వాడీలు, సిఐటియు, సిపిఎం నాయకులు

In The Court of The Hon'ble III Additional. Junior Civil Judge:Ananthapuramu O.S.No:1273/2023 **Between:** Smt.A.Chandrakala ...Plaintiff And J.Ramgopal Reddy ...Defendant **Summons to Defendant** To J.Ramgopal Reddy S/o Narayana Reddy, D.No:11-1-474/4 Aravinda Nagar, Ananthapuramu. పై దావానందలి వాది తనకు రావలసిన ప్రామిసరి నోటు బాకీ దబ్బులు రాబట్టుకొనుటకై ప్రతివాదిపై దావా దాఖలు చేసి ఉన్నారు. పై కేసు నందు ప్రతివాది అయిన మీ హాజరు నిమిత్తం పై కోర్టు వారు 27/02/2024 వ తేది నాటికి వాయిదా వేసి ఉన్నారు. కావున 27/02/2024 వ తేది ఉదయం 10 గం॥30 ని॥మీరు స్వయముగా కానీ, న్యాయవాది ద్వారా కానీ హాజరయి మీ అభ్యంతరములు తెలియజేసుకొనవచ్చును.అట్లు మీరు హాజరు కాని యెడల సదరు పై దావా మీ పరోక్షమందు తీర్మానించబడును. (By Order of The Court) S.ABDUL RASOOL, S.MOHAMMAD IQBAL, Advocates, Ananthapuramu.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో డ్రైవరు మృతి



మృతిచెందిన నాగేంద్ర

గుత్తి : మున్సిపాలిటీ పరిధిలోని గుత్తి ఆర్ఎస్‌లో మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ డ్రైవరు మృతిచెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు బళ్లారి జిల్లా చెలుకురి కి చెందిన నాగేంద్ర (38) గుత్తి మండలంలోని బాచుపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి వాటర్ ట్యాంకర్ డ్రైవర్ గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో స్థానిక మండలంలోని బసినేపల్లి తండాకు ట్యాంకర్ లో తాగునీటిని తీసుకెళ్లాడు. అక్కడ తాగునీటిని వదిలి తిరుగు ప్రయాణం అయ్యాడు. గుత్తి ఆర్ఎస్‌లోని ఓ ఫంక్షన్ హాల్ ఎదురుగా ట్యాంకరు డివైడర్ ఢీకొనింది. దీంతో ఆ ట్యాంకర్ డ్రైవరు కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. అతని చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ మరణించాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

వ్యక్తికి గాయాలు

గుత్తి : మండలంలోని కొత్తపేట గ్రామం వద్ద 67వ జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. టీ.కొత్తపల్లి గ్రామానికి చెందిన శివన్న గుత్తికి ద్విచక్ర వాహనంలో వచ్చాడు. తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదంలో గాయపడ్డ అతన్ని చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. వైద్యుల సూచన మేరకు అదనపు చికిత్స కోసం అనంతపురం సర్వజన ఆసుపత్రికి తీసుకెళ్లారు.